# రేవంత్‌రెడ్డికి ఆగస్టు సంక్షోభం

మొదటిపేజీ తరువాయి...



అలవిగాని హామీలు ఇచ్చారని, ఆయన గ్యారంటీలను ప్రజలు నమ్మలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని త్వరలో పెను సంక్షోభంలోకి నెట్టబోతున్నదని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదని తేల్చిచెప్పారు. సీఎం మీద విశ్వాసం లేకపోవడం వల్లే రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందని పేర్కొన్నారు. ఫేక్ వీడియోలు తయారు చేసి రేవంత్‌రెడ్డి ఫేక్ సీఎంగా పేరు తెచ్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పెరిగిన పోలింగ్ శాతం తమకు సానుకూలమని భావిస్తున్నామని, రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక సీట్లు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**జూన్ 4న ఊహించని ఫలితాలు: ఈటల**

జూన్ 4న ఎవరూ ఊహించని ఫలితాలు రాబోతున్నాయని బీజేపీ నేత ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలనే కాంక్షతో అన్నివర్గాల ప్రజలు ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని, బీజేపీ అఖండ విజయం సాధించబోతున్నదని చెప్పారు. పదేండ్ల కిందట కాంగ్రెస్ చెప్పిన దిగజారుడు మాటలనే ఇప్పుడు మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డి కూడా చెప్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో 12 ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన మ్యానిఫెస్టోను ఖచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

## చేతులు మారుతున్న జాతీయ రహదారులు

- టోల్ అధికారాలను ఫైనాన్స్ సంస్థలకు విక్రయిస్తున్న కాంట్రాక్టు ఏజెన్సీలు
- ఐదేండ్లలో రూ.95 వేల కోట్ల విలువైన రోడ్లు ధారాదత్తం

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారుల నిర్మాణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఫైనాన్స్ సంస్థల నుంచి పెట్టుబడులు సమకూర్చుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు.. తమ పనులు పూర్తయ్యాక లాభం చూసుకొని టోల్ అధికారాలను ఆయా ఫైనాన్స్ సంస్థలు, ఫండింగ్ ఏజెన్సీలకు విక్రయిస్తున్నాయి. దీంతో ఇన్‌ఫ్రా ప్రాజెక్టులతో సంబంధంలేని సంస్థలు పెట్టుబడులు పెట్టి రోడ్ల నిర్వహణ, టోల్ వసూలు బాధ్యతలను దక్కించుకుంటున్నాయి. అనంతరం తమ పెట్టుబడిని టోల్ ద్వారా వసూలు చేసుకుంటున్నాయి. టెండర్లలో రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ ఆ ప్రాజెక్టు పూర్తయాక నిర్దేశిత గడువు వరకు టోల్ వసూలు చేసుకోవడం, తద్వారా తమ పెట్టుబడిని లాభంతో సహా రాబట్టుకోవడం గతంలో ఉన్న ఆనవాయితీ. కానీ, గత కొంతకాలంగా దేశంలో రహదారులను నిర్మిస్తున్న చాలా కాంట్రాక్టు సంస్థలు నిధుల కోసం ఫైనాన్సర్లపై ఆధారపడుతున్నాయి. ఫండింగ్ ఏజెన్సీల నుంచి నిధులు సమకూర్చుకొని పనులు పూర్తయ్యాక టోల్ వసూలు అధికారాలను మరో ఫండింగ్ ఏజెన్సీకి విక్రయిస్తున్నాయి. ఈ విధంగా 2019 నుంచి 20 వేల కిలోమీటర్ల రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన రూ.95 వేల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. కాంట్రాక్టు సంస్థలు, ఎన్‌హెచ్‌ఏఐ నుంచి టోల్ వసూలు అధికారాలను కొనుగోలు చేసిన పలు ప్రైవేటు ఫండింగ్ ఏజెన్సీలు.. రోడ్ల నిర్వహణ బాధ్యతలను మాత్రం ఆయా కాంట్రాక్టు ఏజెన్సీలకు లేదా ఇతర సబ్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నాయి. ఈ కొత్త పద్ధతుల వల్ల రహదారుల నిర్మాణానికి నిధుల కొరత లేకుండా పోయిందని చెప్పవచ్చు. కాంట్రాక్టు ఏజెన్సీలు ఎన్ని పనులు చేపట్టేందుకైనా ముందుకు రావడంతోపాటు త్వరితగతిన ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నాయని రోడ్ల నిర్మాణ రంగం నిపుణులు చెప్తున్నారు.

**రోడ్ల విక్రయం వివరాలు (రూ.కోట్లలో)**



| సంవత్సరం | విలువ |
|---|---|
| 2019 | 22,000 |
| 2020 | 12,570 |
| 2021 | 6,000 |
| 2022 | 17,085 |
| 2023 | 19,000 |
| 2024 | 18,200 |
| మొత్తం | 94,855 |

**విక్రయించిన కొన్ని ముఖ్యమైన రోడ్లు**

- 2019 నుంచి సుమారు రూ.95 వేల కోట్ల విలువైన 20 వేల కి.మీ. రోడ్ నెట్‌వర్క్ ఎన్‌హెచ్‌ఏఐ, ప్రైవేటు ఏజెన్సీల నుంచి చేతులు మారింది.
- 2019లో ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన రూ.5,893 కోట్ల విలువైన తొమ్మిది టీవోటీ (టోల్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్) ప్రాజెక్టులను క్యూబ్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు విక్రయించారు.
- 2022లో రూ.6,500 కోట్ల విలువైన ఎన్‌హెచ్‌ఏఐ ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే టోల్ బాధ్యతలను మాపల్ హైవేస్‌కు విక్రయించారు.
- 2023లో రూ.7,500 కోట్ల విలువైన హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు టోల్ వసూలు అధికారాలను జీఐసీ ప్రైవేట్ లిమిటెడ్-ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్‌కు అమ్మారు.
- 2024లో నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రా ట్రస్టుకు చెందిన రూ.16 వేల కోట్ల విలువైన రోడ్లను కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, అంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్ బోర్డుకు విక్రయించారు.

# బీజేపీతో కాంగ్రెస్ డమ్మీ ఫైట్

మొదటిపేజీ తరువాయి...



నిర్వహించారు. ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులను అభినందించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్, నిజామాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి తదితర నియోజకవర్గాల్లో బలహీనమైన డమ్మీ అభ్యర్థులను నిలబెట్టిందని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి కరీంనగర్ నుంచి పోటీ చేస్తానంటే, బలవంతంగా నిజామాబాద్‌లో నిలబెట్టిందని, ఎవరికీ తెలియని వ్యక్తిని కరీంనగర్‌లో నిలబెట్టిందని, సికింద్రాబాద్ అభ్యర్థి కనీసం ఎన్నికల ప్రచారం కూడా చేయలేదని, మల్కాజిగిరిలో ఆ ప్రాంత ప్రజలకు పరిచయమే లేని అభ్యర్థిని నిలబెట్టిందని వివరించారు.

**మంచి ఫలితాలు సాధిస్తాం**

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ క్యాడర్, నాయకులు సమన్వయంతో చేసిన కృషి వల్ల తప్పకుండా మంచి ఫలితాలు సాధిస్తామని, అత్యధిక సీట్లు సాధించిన పార్టీగా బీఆర్‌ఎస్ నిలబడబోతున్నదని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. కొన్ని స్థానాల్లో కాంగ్రెస్, మరికొన్ని స్థానాల్లో బీజేపీ తమకు ప్రత్యర్థులుగా ఉన్నా అన్ని స్థానాల్లో దీటుగా పోటీనిచ్చింది బీఆర్‌ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నుంచి కొంతమందిని గుంజుకున్నా తమ క్యాడర్ మాత్రం బలంగా నిలదొక్కుకుని పార్లమెంటు ఎన్నికల్లో అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో పడ్డ కష్టం రేపు జరగబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు పునాదిరాయి అవుతుందని కార్యకర్తలకు భరోసా కల్పించారు. తెలంగాణ ప్రయోజనాలకు, రాష్ట్ర అభివృద్ధికి బీఆర్‌ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అన్నది రాష్ట్ర ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు. ఐదు నెలల పాలనలో ఎక్కడా లేని ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్న గ్యారెంటీ లేదని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకుని ఇచ్చిన హామీలను అమలు చెయ్యకపోతే ప్రజా క్షేత్రంలో ధారుణమైన పరాభవం ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

**టైంపాస్ ప్రభుత్వం**

రాష్ట్రంలో ఐదు నెలలు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ టైంపాస్‌గా ప్రభుత్వాన్ని నడిపిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలు, అవసరాల పట్ల అవగాహన లేకుండా చిల్లర మల్లర అంశాలు తీసుకున్నదని మండిపడ్డారు. కొన్ని రోజులు మేడిగడ్డపై, కొన్ని రోజులు శ్వేతపత్రాలు, కొన్ని రోజులు ఫోన్‌ట్యాపింగ్ అంటూ టైంపాస్ చేస్తూ రకరకాలుగా ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నించిందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పనులను, కొత్త జిల్లాలను రద్దు చేయడం ద్వారా కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలన్న కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. చిల్లర రాజకీయాలతో కాంగ్రెస్‌పై ప్రజల్లో విముఖత ఏర్పడి, ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను పెంచిందని చెప్పారు. బీజేపీపై కూడా ప్రజలు పెద్దగా సానుకూలంగా లేరని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నలుగురు ఎంపీలను గెలిపించినా తెలంగాణకు ఏమీ ఇవ్వకపోవడం, పెరిగిన పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువులు, సిలిండర్ ధరలు కారణంగా బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని విశ్లేషించారు.

**బలహీనవర్గాలకు న్యాయం చేసిన బీఆర్‌ఎస్**

17 పార్లమెంట్ స్థానాల్లో 12 జనరల్ సీట్లుంటే, అందులో 50% సీట్లు బీసీ అభ్యర్థులకు కేటాయించిన పార్టీ బీఆర్‌ఎస్ అని కేటీఆర్ తెలిపారు. అత్యధికంగా సీట్లు ఇచ్చి బలహీనవర్గాలకు బీఆర్‌ఎస్ న్యాయం చేసిందని చెప్పారు. సీనియర్ నాయకులు, పార్టీతో, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న నాయకులకు తాము టికెట్లు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు పారాచూట్ లీడర్లకు, బీఆర్‌ఎస్ నుంచి ఎత్తుకెళ్లినవారికి టికెట్లు ఇచ్చాయని దుయ్యబట్టారు. దాదాపు ఏడుగురు బీజేపీ అభ్యర్థులు, నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిపోయినవారేనని చెప్పారు. కాంగ్రెస్ నిలబెట్టిన అభ్యర్థుల పట్ల సొంత పార్టీలోనే విముఖత వ్యక్తమైందని పేర్కొన్నారు. తమ అభ్యర్థుల పట్ల సానుకూలత, ఆ పార్టీ అభ్యర్థుల పట్ల వ్యతిరేకత కనిపించిందని చెప్పారు. నెల క్రితం బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు రాదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని, కానీ, నెలరోజుల్లోనే జాతీయ పార్టీలకు ముచ్చెమటలు తెప్పించిన ఘనత గులాబీ సైనికులదేనని స్పష్టంచేశారు. సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

**మలుపు తిప్పిన కేసీఆర్ బస్సుయాత్ర**

**రాజకీయ** స్వార్థపరుల కుట్రలు, కుతంత్రాలు, దాడులను తిప్పికొడుతూ మొక్కవోని ధైర్యంతో ముందుకుసాగామని, కేసీఆర్ బస్సుయాత్ర రాష్ట్ర రాజకీయాలను ఒక మలుపు తిప్పిందని కేటీఆర్ పేర్కొన్నారు. బస్సుయాత్రతో రెండు జాతీయ పార్టీలు దిగిరాక తప్పలేదని, కాంగ్రెస్, బీజేపీల నాయకత్వం తెలంగాణ చుట్టూ గింగిరాలు కొట్టేలా చేసిందని చెప్పారు. కేసీఆర్ బస్సుయాత్ర ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా గులాబీ సైన్యంలో గుండెల నిండా ఆత్మవిశ్వాసం నింపిందని పేర్కొన్నారు. రెండు జాతీయ పార్టీలకు ముచ్చెమటలు పట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు.

# ..మనమేం చేస్తం!

మొదటిపేజీ తరువాయి...



ఎన్నికల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూశారని, కొందరిని గుర్తించి కేసులు కూడా నమోదు చేసినట్టు చెప్పారు.

**కోడ్ ముగిసిన వెంటనే కొత్త వీసీలు**

ఎన్నికలు, రాజకీయాలు ముగిశాయని, ఇకపై తమ దృష్టి మొత్తం పాలనపైనే పెడతామని స్పష్టం చేశారు. బుధవారం నుంచి సచివాలయానికి వెళ్తానని, విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తామని తెలిపారు. ఇక నుంచి రాజకీయ విమర్శలను పట్టించుకోబోనని, పరిపాలనపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరిస్తానని స్పష్టం చేశారు. తొలుత రైతుల రుణమాఫీపై దృష్టి పెట్టనున్నట్టు చెప్పారు. అందుకోసం ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోనే రుణం తీసుకుంటామని, బ్యాంకులకు ప్రభుత్వం కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి రుణం బదిలీ చేసుకుంటుందని తెలిపారు. ధరణిపై కమిటీ రిపోర్టు ఆధారంగా ముందుకు వెళ్తామని, అసెంబ్లీలో చర్చించకుండా ఏ నిర్ణయమూ తీసుకోబోమని స్పష్టం చేశారు. అఖిలపక్షంతో చర్చించాకే పాలసీలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రైతులకు పెట్టుబడి, పంటలకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో స్కూళ్లు, ఫీజులపై దృష్టి సారిస్తామని, హాస్టళ్లలో సన్నబియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే యూనివర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తామని తెలిపారు.

**రేషన్‌షాపుల్లో సన్నబియ్యం.. 9 రకాల వస్తువులు**

రైతుల పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి తక్కువ ధరకు రేషన్‌షాపుల్లో పేదలకు అందించే ఆలోచన చేస్తున్నట్టు రేవంత్‌రెడ్డి తెలిపారు. రేషన్‌షాపులను గత ప్రభుత్వం బియ్యానికి మాత్రమే పరిమితం చేసిందని, ఇక పై రైతుల నుంచి కొనుగోలు చేసి 9 రకాల వస్తువులను పంపిణీ చేస్తామని వివరించారు. సన్నబియ్యం కూడా ఇస్తామని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు వెంటనే చర్యలు తీసుకుంటామని, కొనుగోలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**జిల్లాలను పునర్వ్యవస్థీకరిస్తాం**

**జిల్లాల** పునర్వ్యవస్థీకరణ విషయంలో ముందుకే వెళ్తామని, అంతకంటే ముందు మండలాలు, రెవెన్యూ డివిజన్లను క్రమబద్ధీకరిస్తామని రేవంత్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా జిల్లాలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. కోటి జనాభా ఉన్న హైదరాబాద్‌ను, ఒక్క నియోజకవర్గం ఉన్న వనపర్తిని కూడా గత ప్రభుత్వం జిల్లాగా చేసిందని విమర్శించారు. పాలమూరుపై ప్రత్యేక దృష్టి పెడతామని, ప్రాజెక్టులు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

**యూటీ ముగిసిన అధ్యాయం**

హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం అనేది ముగిసిన అధ్యాయమని సీఎం స్పష్టం చేశారు. నగరం యూటీ అవుతుందని ఎవరైనా ప్రచారం చేస్తే అది తెలివి తక్కువ తనమే అవుతుందని మండిపడ్డారు. వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. హుస్సేన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు గోదావరి జలాలు నిత్యం వచ్చేలా చేస్తామని వివరించారు. ఫార్మాసిటీలను విస్తరిస్తామని, ఫార్మా కంపెనీలన్నీ ఒకే దగ్గర ఉంటే సిటీ విడిచి పెట్టి వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. మూసీని ఒక ఆదాయ వనరుగా వాడుకుంటామని రేవంత్ చెప్పారు.

## 13 సీట్లు గెలుస్తున్నాం

**కంటోన్మెంట్‌లో 20 వేల మెజార్టీ**

**బీజేపీకి 210 సీట్లు మించవు**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 13 స్థానాలు గెలుచుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగిన ఎన్నికల సరళినిబట్టి కాంగ్రెస్ పార్టీ తక్కువలో తక్కువగా 9 సీట్లు గెలుస్తుందని, ఫలితాలు ఇంకా మెరుగ్గా ఉంటే 13 సీట్లు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కంటోన్మెంట్ ఎన్నికల్లో తమదే విజయమన్న ఆయన.. అక్కడ 20 వేల వరకు మెజారిటీ సాధించబోతున్నట్టు చెప్పారు. కేంద్రంలో బీజేపీకి ఈసారి 210 సీట్లు కూడా దాటే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ఆరేడు స్థానాల్లో డిపాజిట్ కూడా రాదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పై కోపంతో ఆ పార్టీ పూర్తిగా బీజేపీకి సపోర్ట్ చేసిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

# ఎవరి అంచనాలు వారివే!



- కూడికలు.. తీసివేతల్లో పార్టీల మథనం
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కలు
- అధికార పార్టీల ముఖ్య నేతల్లో టెన్షన్
- మరో 20 రోజులపాటు అదే ఉత్కంఠ

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగియడంతో రాజకీయ పార్టీలు తమకు ఎన్ని సీట్లు, ఎన్ని ఓట్లు వస్తాయనే అంచనాల్లో తలమునకలయ్యాయి. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న నేపథ్యంలో ఓటరు నాడిని పట్టుకోవడం కొంచెం కష్టంగానే ఉన్నప్పటికీ, వివిధ పార్టీల అభ్యర్థులు, అధినాయకత్వాలు పోలింగ్ ట్రెండ్‌పై క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకొని లెక్కలేసుకుంటున్నాయి. మంగళవారం ఉదయం నుంచి పార్టీల ముఖ్య నేతలు పోలింగ్ శాతాన్ని పరిగణనలోకి తీసుకొని, ఒక్కొక్క పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, వాటిలో ఇటీవలి ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓటు షేర్, ప్రస్తుత పోలింగ్ ట్రెండ్ ఆధారంగా అంచనాలు వేసుకుంటున్నారు. ఆ యా నియోజకవర్గాల్లో అభ్యర్థి, పార్టీ ప్రచారం ఎలా సాగింది? ఓటర్లను ఏయే అంశాలు ప్రభావితం చేశాయి? తదితర అంశాల ప్రాతిపదికగా ప్రస్తుతం ఎన్ని ఓట్లు వచ్చాయి? అవతలి పార్టీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు ఎన్ని? అని లెక్కలేసుకుంటున్నారు.

**అధికార పార్టీలకు టెన్షన్**

రాష్ట్రంలో తలపడిన మూడు ప్రధాన పార్టీల్లో అధికార పార్టీ నేతలకు ఫలితాలపై టెన్షన్ అధికంగా ఉండటం సహజం. ఫలితాల్లో తేడా వస్తే తమ పదవులకే ఎసరు వస్తుందన్న దిగులు అధికార పార్టీ నేతలను వెంటాడుతున్నది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోపాటు కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ ఈసారి తెలంగాణ మీద ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో ఆ రెండు పార్టీల జాతీయ నాయకత్వాలు సైతం టెన్షన్ పడుతున్నాయి. ఐదు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ప్రజాక్షేత్రంలో బీఆర్‌ఎస్ తొడగొట్టి సవాల్ చేసింది. 'ఇటీవలే మనం అధికారంలోకి వచ్చాం. కేంద్రంలో కూడా అధికారంలోకి రావాలంటే మీరు బాగా పని చేయాలి. మీ పనితనానికి ఫలితాలే కొలమానం' అని కాంగ్రెస్ హైకమాండ్ మంత్రులతోపాటు ముఖ్యమంత్రికి కూడా టార్గెట్ ఇచ్చింది. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోతే ఆఖరికి మంత్రి పదవులు కూడా పోతాయి అనే రీతిలో అధిష్ఠానం ఇద్దరు, ముగ్గురు మంత్రులను సున్నితంగా హెచ్చరించినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మంత్రులు ఎవరికివారు తమతమ జిల్లాలు, తమ సొంత నియోజకవర్గాల్లో సర్వశక్తులు ఒడ్డారు. మరోవైపు మూడోసారి పీఠం ఎక్కడమే పరమావధిగా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాతోపాటు బీజేపీలోని సమస్త పటాలం సర్వశక్తులు ఒడ్డింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన తరువాత కొది నెలలకే వచ్చిపడ్డ పార్లమెంట్ ఎన్నికల్లో క్యాడర్‌లో నిరాశ, నిస్పృహలను తొలగించి పార్టీకి భవిష్యత్తు ఉన్నదని నిరూపించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సైతం సర్వం ధారపోసింది. పార్టీ అధినేత కేసీఆర్ సహా పార్టీ నాయకత్వం మొత్తం తమ శక్తిని వినియోగించింది. మూడు పార్టీలు హోరాహోరీగా తలపడటంతో క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్ ఎటువంటి ఫలితాన్ని ఇస్తుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది. మరో 20 రోజులు ఓపికపడితే కానీ రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం ఎట్లా ఉంటుందో చెప్పలేమంటూ రాజకీయ విశ్లేషకులు సైతం ఫలితాలపై అంచనాలకు రాలేకపోతుండటం గమనార్హం.





బీఆర్‌ఎస్ కార్యకర్తపై సీఐ దాడిని నిరసిస్తూ భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్, ఆదివాసీ నేతలు (ఇన్‌సెట్‌లో) బాధితుడు నవీన్

## కాంగ్రెస్ కనుసన్నల్లో పోలీసుల దౌర్జన్యం

- సెల్‌ఫోన్‌తో బూత్‌లోకి కాంగ్రెస్ నేత
- కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్త నవీన్
- కాంగ్రెస్ నేత సూచనతో నవీన్‌పై సీఐ దాడి.. నిరసనగా రాస్తారోకో

అశ్వారావుపేట, మే 14: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున బూత్‌లో చోటుచేసుకున్న ఘటన విషయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తపై సీఐ దాడి చేశారు. ఈ దాడిని నిరసిస్తూ అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో బీఆర్‌ఎస్, ఆదివాసీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వెంటనే పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి.. విచారణ జరిపి న్యాయం చేస్తామని సీఐ జితేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం అనంతారంలో సోమవారం పోలింగ్ జరుగుతుండగా కాంగ్రెస్ నాయకుడు సూరిబాబు సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లబోయాడు. దీనిపై బీఆర్‌ఎస్ కార్యకర్త గిగా నవీన్.. అక్కడే ఉన్న కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో కానిస్టేబుల్ స్పందించి సూరిబాబు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోగా.. నవీన్‌పై సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. 'సెల్‌ఫోన్ పట్టిస్తావా? నీ అంతు చూస్తా?' అంటూ హెచ్చరించాడు. మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు నవీన్‌కు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలంటూ పిలిచారు. దీంతో ఎంపీటీసీ భర్త పద్దం శ్రీనుతో కలిసి నవీన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. కొద్దిసేపటికి సీఐ జితేందర్‌రెడ్డి వచ్చి నవీన్‌ను కొట్టి స్టేషన్లోనే సాయంత్రం వరకు నిర్బంధించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు స్టేషన్‌కు వచ్చి 'నవీన్‌ను ఎందుకు అదుపులోకి తీసుకున్నారు? ఎవరు ఫిర్యాదు చేశారు?' అంటూ నిలదీశారు. సమాధానం రాకపోవడంతో బీఆర్‌ఎస్, ఆదివాసీ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎస్సై శివరామకృష్ణ వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు.




అచ్చంపేటలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ దాడి

- పోలీసులు చూస్తుండగానే కర్రలతో చితక్కొట్టి దౌర్జన్యం
- దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితుడు
- దాడికి గువ్వల, ఆర్‌ఎస్పీ ఖండన

అచ్చంపేట, మే 14: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలతో మూకుమ్మడిగా దాడి చేసి భయానక వాతావరణాన్ని సృష్టించారు. పట్టణంలోని 89వ పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం జరిగిన చిన్నపాటి ఘర్షణపై సాయినగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం రెండో వార్డు కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేశారు. గది తలుపులను పగులగొట్టి దాదాపు 15 మంది ఇంట్లోకి చొరబడి అక్కడున్న వారిపై దాడికి తెగబడ్డారు. కనిపించిన వారిని కనిపించినట్టుగా చితకబాదారు. కుర్చీలు, తలుపులను ధ్వంసం చేశారు. మహిళలు, పిల్లలు వద్దని వారించినా వినకుండా మహిళలపైనా దాడికి పాల్పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి కాంగ్రెస్ కార్యకర్తలను వారించినా కర్రలతో చితక్కొట్టారు. సుంకరి మహేశ్, సురేశ్, బాలకృష్ణ, లింగం, చరణ్‌పై దాడిచేయగా మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని అచ్చంపేట దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అనంతరం కాంగ్రెస్‌కు చెందిన రామయ్య, మంత్రాల లాలుయాదవ్, మంత్రాల అంజి, జితేందర్, సాయిలు, తిరుపతయ్య, బన్ని, కొడెల మల్లయ్య, మంత్రాల శ్రీను, రామ్, లక్ష్మణ్, పుల్జాల మల్లేశ్, గుడ్ల రవి తదితరులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఆగడాలను అరికట్టాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు బాలరాజు ఇంటి నుంచి ర్యాలీగా వెళ్లి పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ దాడిని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఖండించారు.

**లోకం పోకడ**





మా బతుకు పంట బాగుచేసే రుతుపవనాల కోసం ఎదురు చూస్తున్నాం!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 41.4°c | 27.8°c |
| మెదక్ | 40.7°c | 22.7°c |
| ఆదిలాబాద్ | 40.3°c | 26.9°c |
| రంగారెడ్డి | 39.7°c | 22.4°c |
| నిజామాబాద్ | 39.0°c | 27.0°c |
| ఖమ్మం | 38.0°c | 27.0°c |
| వరంగల్ | 38.0°c | 26.0°c |
| కరీంనగర్ | 38.0°c | 27.0°c |
| హైదరాబాద్ | 37.2°c | 27.3°c |
| మహబూబ్‌నగర్ | 36.0°c | 24.0°c |

## టీచర్లపై విరిగిన లాఠీ

- పోలింగ్ రెమ్యునరేషన్ అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసుల ప్రతాపం
- నారాయణఖేడ్‌లో రాత్రివరకు హల్‌చల్
- ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు

నారాయణఖేడ్/హైదరాబాద్, మే 14: పోలింగ్ విధులు నిర్వహించినందుకుగానూ ఇతర పార్లమెంట్ నియోజకవర్గపరిధిలో చెల్లిస్తున్న విధంగా రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరిన ఉపాధ్యాయులపై పోలీసులు ప్రతాపం చూపారు. పంపిణీ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పోలింగ్ సిబ్బందిపై పోలీసులు లాఠీ చార్జి చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో చోటు చేసుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ విధులు ముగించుకొని పోలింగ్ సిబ్బంది పంపిణీ కేంద్రం వద్దకు చేరుకొన్నారు. పోలింగ్ విధులకు సంబంధించిన రెమ్యూనరేషన్‌ను జీవో 61 నిబంధనల ప్రకారం చెల్లించాలని ఉపాధ్యాయులు ఆర్డీవో అశోక చక్రవర్తిని కోరారు. ఆర్డీవో మాత్రం అందుకు ఒప్పుకోకుండా రూ.2400 చొప్పున చెల్లిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు అందుకు నిరాకరిస్తూ నిరసనకు దిగారు. ఉపాధ్యాయులను శాంతింపజేసే ప్రయత్నంలో పోలీసులకు, ఉపాధ్యాయులకు తోపులాట జరిగింది. పోలీసులు ఉపాధ్యాయులపై స్వల్ప లాఠీచార్జి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం అధికారులు జోక్యం చేసుకొని ఉపాధ్యాయులను శాంతింపజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెమ్యూనరేషన్ చెల్లిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు రాత్రి వరకు అక్కడే వేచి ఉన్నప్పటికీ అధికారులెవరూ స్పందించకపోవడంతో చేసేదేమిలేక వెనుదిరిగారు.

**లాఠీచార్జికి కారణమైన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి**

రెమ్యూనరేషన్ ఇవ్వాలని కోరినందుకు ఉపాధ్యాయులను పోలీసులతో కొట్టించడమేంటని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీఓ, ఏపీవోలకు రోజుకు రూ.600, ఓపీవోలకు రూ. 400 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నం 61ను ఈనెల 11న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీవో, ఏపీవోలకు రూ.3,150 చెల్లిస్తున్నారని, నారాయణఖేడ్‌లో మాత్రం రూ.2,400 చెల్లించారని పేర్కొన్నారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు ఉపాధ్యాయులపై విచక్షణారహితంగా దాడి చేసి, గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన నారాయణఖేడ్ ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని సీఈవోను కోరారు. టీచర్లపై లాఠీచార్జి చేయడం అన్యాయమని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల విధులు నిర్వహించిన వారిపై లాఠీచార్జికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, పీ నాగిరెడ్డి, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యూపీపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్లా, గుళ్లపల్లి తిరుమలకాంతికృష్ణ డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న పీ మధుకుమార్ బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యారని, ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ఆయనకు మెరుగైన చికిత్స అందించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ సీఈవోకు వినతిపత్రాన్ని సమర్పించారు.